శిథిలావస్థలో గ్రంథాలయం

- భయాందోళనలో పాఠకులు
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం

బాల్కొండ: ప్రజలకు విజ్ఞానాన్ని అందించాల్సిన గ్రంథాలయం పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటంతో పాఠకులకు సరైన రీతిలో సేవలందించలేకపోతోంది. గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు వానకు తడుస్తూ చెదలు పడుతున్న దుస్థితి నెలకొంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీలోని గ్రామీణ గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో రేకుల షెడ్డుతో నిర్మించిన ఇరుకు గదిలోనే గ్రంథాలయం ఇంకా కొనసాగుతోంది. దీంతో పాఠకులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్ట్ కాలనీ అంటే దాదాపుగా ప్రభుత్వ ఉద్యోగుల కాలనీగా చెప్పుకోవచ్చు. దీంతో గ్రంథాలయంలో పుస్తక పఠనం చేసే వారు ఎక్కువగానే ఉంటారు. అందుకే ఎస్సారెస్పీ కాలనీలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం మరిచారు. రేకులు పగిలిపోయి వర్షం వస్తే ఊరుస్తోంది. అంతే కాకుండా ఇరుకు గది కావడంతో నల్గురు కూర్చుంటే స్థలం ఉండని దుస్థితి ఉంది. ప్రతి ఏడాది నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. కానీ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయంపై నిలువెత్తు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రంథపాలకుడు గత ఆరేళ్లుగా లేకపోవడంతో తాత్కాలిక గ్రంథపాలకుడితో నిర్వహణ చేపడుతున్నారు. ప్రధాన గ్రంథాలయం బాల్కొండలో ఉంది. గ్రామీణ గ్రంథాలయాలు వన్నెల్(బి), ముప్కాల్, ఎస్సారెస్పీ కాలనీలో ఉన్నాయి. ఎక్కడ చూసిన ఇదే పరిస్థితి ఉంది. ప్రధాన గ్రంథాలయంలో కూడా పూర్తి స్థాయి గ్రంథ పాలకులు లేక ఇన్‌చార్జి గ్రంథపాలకులతోనే కొనసాగుతోంది. ఈ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు తీసుకు రావడమే మానేశారు. దీంతో ఉన్న పుస్తకాలతోనే కుస్తీ పట్టి రావాల్సి వస్తోందని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని పాఠకులు కోరుతున్నారు.

మోర్తాడ్‌లో అధ్యాపకుల పల్లెబాట

- డిగ్రీ కళాశాల మనుగడ కోసం మండుటెండలో ప్రచారం
- అడ్మిషన్ల కోసం తీవ్ర కృషి

మోర్తాడ్: డిగ్రీ సీట్లను భర్తీ చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలనే సంకల్పంతో మోర్తాడ్ అధ్యాపకులు పల్లెబాట పట్టారు. ఒకవైపు సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తూనే మరోవైపు కళాశాల మనుగడకు తీవ్రంగా కృషి చేస్తుండటంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు. వాస్తవానికి డిగ్రీ అడ్మిషన్లు మొత్తం ఆన్‌లైన్ ద్వారానే భర్తీ చేయాల్సి ఉంది. విద్యార్థులకు మోర్తాడ్ కళాశాల గురించి అవగాహన కల్పిస్తే దోస్త్ వెబ్‌పోర్టల్‌లో మొదటి ఆప్షన్‌గా ఇదే కళాశాలను ఎంచుకుంటారని అధ్యాపకులు భావిస్తున్నారు. మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, వేల్పూర్, ముప్కాల్ మండలాల్లో డిగ్రీ కళాశాల అడ్మిషన్ల కోసం అధ్యాపకులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. బ్రోచర్లను ప్రత్యేకంగా ముద్రించి వాటి ద్వారా ప్రచారం చేపడుతున్నారు. కళాశాల పనితీరును వివరించేలా బ్రోచర్లతో పాటు వాల్‌పోస్టర్లను ముద్రించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి పెద్దన్న ఆధ్వర్యంలో అధ్యాపకుల బృందం అన్ని గ్రామాల్లో విస్తృతమైన ప్రచారం చేపడుతోంది.


ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

క్లుప్తంగా

కంపోస్టు షెడ్డు పరిశీలన



వర్ని: మండలంలోని సత్యనారాయణపురంలో కంపోస్టు షెడ్డును ఎంపీవో చందర్ నాయక్ గురువారం పరిశీలించారు. కంపోస్ట్ షెడ్‌లో తడి, చెత్త పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఎలా కంపోస్ట్ చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సాయిలు సిబ్బంది మహేశ్ ఉన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి విరాళం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన గడ్డం సంతోష్‌రెడ్డి రూ. 25 వేల విరాళాన్ని తనవంతు సహాయంగా కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. దీంతో కమిటీ సభ్యులు దాత సంతోష్ రెడ్డి, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న స్థానిక బీజేపీ నాయకుడు ముస్కు నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీడీ రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల కొలతలు చేపట్టాలి



బాల్కొండ: మండల కేంద్రంలోని చెరువుల శిఖం కొలతలను చేపట్టాలని మైనర్ ఇరిగేషన్ ఈఈ భాను ప్రకాశ్‌కు వీడీసీ సభ్యులు గురువారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని అలీంచెరువు, హైదర్‌కుంట ఎఫ్‌టీఎల్ లెవల్, చెరువుల్లో పూడికతీత చేపట్టాలన్నారు. చెరువుల్లో కబ్జాకు గురైన భూములను వెలికి తీయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో ఇందిరాకు పండ్ల మొక్కలను నాటించాలని కోరారు. వీడీసీ అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు గంగాధర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో కుస్తీ పోటీలు



వర్ని(చందూర్): మండల కేంద్రంలో ఎల్లమ్మ జాతర సందర్భంగా గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. రూ. 50 నుంచి రూ. 5 వేల వరకు పోటీలో గెలుపొందిన మల్లయోధులకు గ్రామ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. పోటీల్లో గ్రామస్తులతో పాటు మహారాష్ట్రకు చెందిన మల్ల యోధులు పాల్గొన్నారు.

అంబులెన్స్ తనిఖీ



ఆర్మూర్: పట్టంలోని 1962 అంబులెన్స్‌ను అంబులెన్స్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భాగీష్ మిశ్రా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1962 అంబులెన్స్ ద్వారా అత్యుత్తమ వైద్య సేవలను మూగజీవాలకు అందించాలని సూచించారు. అంతకుముందు అంబులెన్స్‌కు సంబంధించిన వివిధ రకాల పరికరాల పనితీరు, మందులను పరిశీలించారు. మూడు నెలల నుంచి పశువులకు అందించిన సేవలు, వివరాలను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ విజేందర్, డాక్టర్ కాంతయ్య, పారావేట్ అరుణ్ కుమార్, కెప్టెన్ ప్రేమ్ ఉన్నారు.

శిక్షణతో ఆర్థికంగా ఎదగాలి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మహేశ్వర్ సూచించారు. డిచ్‌పల్లి ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో నెల రోజులుగా మహిళలకు ఇస్తు న్న ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎం మహేశ్వ ర్ మాట్లాడుతూ.. నేర్చుకోవడం అనేది ఏ దశలో నూ ఆగకూడదని, నిరంతరం కొనసాగుతూ ఉండాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి టూల్ కిట్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రంజిత్, నవీన్, శ్రీలత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కూలీలకు పనిదినాలు పెంచాలి


కూలీలతో మాట్లాడుతున్న సురేశ్

కమ్మర్‌పల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు ఏడాదికి 200 రోజుల పాటు పని దినాలు కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని బషీరాబాద్‌లో ఉపాధి హామీ కూలీలతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ సర్కార్ నిర్వీర్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో కోతలు విధిస్తూ కూలీ పనికి వచ్చేటప్పుడు పోయేటప్పుడు వేలిముద్రలు పెట్టాలని, కొలతలతో పనిచేయాలనే ఆంక్షలు పెడుతూ కార్మికులను పనికి దూరం చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. కూలీలకు రోజు వారి కూలి రూ. 600 చెల్లించడంతో పాటు, ప్రమాద బీమా, జాబ్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు.

చురుగ్గా సాగుతున్న పనులు


రుద్రూర్‌లో పనులను పరిశీలిస్తున్న సీఆర్పీ

రుద్రూర్: మండలంలోని వివిధ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ స్కీం కింద మండలంలోని అక్బర్‌నగర్, బొప్పాపూర్, రాణంపల్లి, సిద్ధాపూర్, రాయకూర్, రాయకూర్ క్యాంపు, సిద్ధాపూర్, సులేమాన్‌నగర్, చిక్కడపల్లి, కొందాపూర్, రుద్రూర్, గ్రామాల్లోని 16 పాఠశాలలను ఎంపిక చేశారు. పనుల నిర్వహణకు రూ.40లక్షల 43వేలు కేటాయించారు. ఈ నిధులతో తాగునీరు, విద్యుత్, తరగతి గదులు మరమ్మతు, విద్యార్థినుల కోసం మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మా ణాలు, పాత వాటికి మరమ్మతు పనులు చేపట్టడం లాంటి పనులు చేపడుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పూర్తి చేయించడానికి మండల విద్యాధికారి ఆధ్వర్యంలో సీఆర్పీలు పర్యవేక్షిస్తున్నారు. పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలు బలోపేతం చేయడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగే ఆస్కారం ఉందని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు భావిస్తున్నారు.

ఘనంగా బుద్ధ జయంతి


ఆలూర్‌లో బుద్ధ జయంతి నిర్వహిస్తున్న గ్రామస్తులు


కందకుర్తిలో..


ఆర్మూర్‌లో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

పెర్కిట్/ రెంజల్/ మోర్తాడ్/ ఆర్మూర్/ కమ్మర్‌పల్లి: ఆలూర్ మండల కేంద్రంలో గురువారం బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామస్తులు బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మాలమహానాడు నాయకులు బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకుడు రవీంద్రబాబు, రాందాస్, శంకర్, యశ్వంత్, నందులాల్, మొగులాజీ, గోపి, సంజీవ్, దేవీదాస్ తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్‌లోని శ్రీమోక్షానంద స్వామి ఆశ్రమంలో బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఎస్ఎస్ ఆధ్వర్యంలో బుద్ధ జయంతిని చేపట్టారు. మోక్షానంద స్వామి మాట్లాడుతూ.. బుద్ధుడు చూపిన మార్గం ఎంతో ఆచరణీయమైనదని కొనియాడారు. గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని అశోక్ నగర్‌లోని పురాతన బుద్ధ విహార్ వద్ద బుద్ధ వందనం, బుద్ధ జయంతి కార్యక్రమాన్ని చేపట్టారు. బుద్ధుని విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తలారి చందు మీనా, ప్రభాకర్, శెట్పల్లి నారాయణ, అంగరి ప్రదీప్, పింజ అశోక్, భీంగల్ సురేశ్, రాజు, వికాస్ పవర్, రాజేందర్ పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్ మాల సంఘం ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి, గౌతమ బుద్ధుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన, బుద్ధ వందనం, పంచశీలా, త్రిశరణ పాటించారు. కార్యక్రమంలో మాల సంఘం కార్యవర్గ సభ్యులు దేవి హరీశ్, తలారి రమేశ్, దేవి శంకర్, మాజీ సర్పంచ్ గోపి, శ్రీనివాస్, రంజిత్, శేఖర్, క్రాంతి, తలారి, ప్రసాద్, అశోక్, శ్రీధర్, శేఖర్, లిఖిత, కళావతి, లక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్‌లో ప్రవచిస్తున్న ఆశ్రమ అధిపతి మోక్షానంద స్వామి


కమ్మర్‌పల్లిలో జయంతి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

చెత్తను వేర్వేరుగా సేకరించాలి

ధర్పల్లి: తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించిన తర్వాతే వాహనాల్లో డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ అధికారులను ఆదేశించారు. మండలంలోని సీతాయిపేట్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డ్‌లను ఆయన గురువారం పరిశీలించారు. కంపోస్ట్ షెడ్లలో తడి చెత్తతో ఎరువును తయారుచేసి మొక్కలకు ఉపయోగించుకోవాలని సూచించారు. డీపీవో తరుణ్ చక్రవర్తి, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, ఏపీవో వినోద తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



రెంజల్: కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలోని శ్రీసంత్ సీతారాం దాం ఆశ్రమంలో ఆలయ ప్రథమ సంవత్సర వార్షికోత్సవ వేడుకలను భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తుల సమక్షంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు సీతారాం త్యాగి మహరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. గతేడాది భక్తులు అందించిన విరాళాలతో ఆశ్రమ ఆవరణలో శ్రీ పట్టాభి శ్రీరామమందిరం, నర్మదేశ్వరుని మందిరం, శ్రీ వేంకటేశ్వర మందిరాలను నిర్మించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా హాజరై పూజలో పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఆర్యసమాజ్‌లో సత్సంగ్ సమ్మేళనం


ప్రవచనాలు చేస్తున్న బ్రహ్మానంద సరస్వతి


సమ్మేళనానికి హాజరైన సభ్యులు

బోధన్: పట్టణ కేంద్రంలోని ఆర్య సమాజ్ మందిరంలో గురువారం సాయంత్రం సత్సంగ్ సమ్మేళనం నిర్వహించారు. కామారెడ్డి ఆర్షగురులానికి చెందిన స్వామి బ్రహ్మానంద సరస్వతి విచ్చేసి దివ్య మానవ నిర్మాణ విధి అంశంపై ప్రవచనాలు చేశారు. యువతలో క్రమ శిక్షణ, సేవా భావం, పట్టుదల, ధార్మికత్వం సుగుణాలను నేర్పించాలని సూచించారు. ఆర్యవీర్ దళ్, వైదిక వానప్రస్థ సాధక ఆశ్రమ సమితి భువనగిరి వారు ఈ నెల 27 నుంచి జూన్‌2 వరకు యువ చరిత్ర నిర్మాణ శిబిరాన్ని భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పంతో నిర్వహిస్తున్న శిబిరాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆర్య సమాజ్ ప్రతినిధి ప్రదీప్‌గుప్తా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



బోధన్: సాలూర మండల కేంద్రంలోని 12, 13వ వార్డుల్లో తాగునీరు కలుషితమవుతోందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు తహసీల్దార్ రమేశ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఏడాదిగా కలుషిత తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు దు మ్ము ధూళీతో కలుషితమై కులాయిలకు సరఫరా అవుతోందని పేర్కొన్నారు. కలుషిత తాగునీటితో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని వివరించారు. త్వరితగతిన పాత పైప్‌లైన్ మార్చి కొత్త పైప్‌లైన్ వేయాలని కోరారు. కాలనీవాసులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మికం

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థాన ఆలయ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ముత్యాల తలంబ్రాలతో ఊరేగింపు చేపట్టారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పురోహితుడు, ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చందూర్‌లో రథోత్సవం



వర్ని(చందూర్): చందూర్ మండల కేంద్రంలో ఎల్లమ్మ జాతర సందర్భంగా గురువారం తెల్లవారుజామున ఆలయ కమిటీ సభ్యులు రథోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. రథానికి పొడువాటి కర్రను కట్టి దానిపై పూజారిని కూర్చోబెట్టి ఆలయం చుట్టూ తిప్పారు. ఎల్లమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఏడాది ఎల్లమ్మ పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..



రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల సమక్షంలో కల్యాణ్ని ఘనంగా చేపట్టారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది వైశాఖమాస పౌర్ణమి రోజు ఆలయంలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ కర్కె అశోక్, చేనేత సహకారం సంఘం అధ్యక్షుడు మోత్కురి నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో..

మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కారించుకుని భక్తులు అన్నపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేశ్వరప్పా ఆధ్వర్యంలో దేవతామూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

రెంజర్లలో వీరబ్రహ్మేంద్ర స్వామి..



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిదాంబ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో అన్నదానం నిర్వహించారు. మండలంలోని వెంచిర్యాల్‌లో, మెండోరా మండలం వెల్కటూర్‌లో, మెండోరా మండల కేంద్రంలోని ఆలయాల వద్ద పౌర్ణమి సందర్భంగా అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమెరికాలో ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో ఎన్‌ఆర్‌ఐ టీం సభ్యులు

వేల్పూర్: అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలోని ఫ్రీమాంట్ నగరానికి చేరుకున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ టీం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. మూడవసారి ఎమ్మెల్యేగా గెలిచినందుకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేతో ఎన్‌ఆర్‌ఐలు చర్చించారు. ప్రస్తుతం అధికారంలోకి రాకపోయినా భవిష్యత్తు బీఆర్‌ఎస్ పార్టీదే అని ఎన్‌ఆర్‌ఐలు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు సాగర్, రాజ్‌భవాని, నవీన్, భాస్కర్, రామ్‌వాల, కరుణాకర్, మాధవ్, శివ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బేకరీలు, హోటళ్లలో తనిఖీలు


హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆర్మూర్: పట్టణంలో కాలుష్య నియంత్రణ మండలి సూచనలను అనుసరించి చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పలు హోటళ్లు, బేకరీల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకం, పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించి పట్టుబడిన ప్లాస్టిక్‌ను సీజ్ చేసి బేకరీ యజమానికి రూ. 10,500 జరిమానా విధించారు. తనిఖీలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ కుమార్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది వెంకటేశ్ అక్షయ్, రవి, ప్రశాంత్, నరేశ్, సంతోష్ ఉన్నారు.

నేడు ఎడపల్లికి ఎమ్మెల్యే రాక



ఎడపల్లి: మండలంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శుక్రవారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులు, తాగునీటి సమస్యలపై జానకంపేట, ఎమ్మెస్సీ ఫారం, మధ్యాహ్నం ఒంటిగంటకు బ్రాహ్మణపల్లిలో నిర్వహించే అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గౌతమి అధ్యక్షతన శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.